క్లుప్తంగా

సోలార్ కార్మికులకు బోనస్ చెల్లించండి..

ఇల్లెందు: సింగరేణిలో పనిచేస్తున్న సోలార్ కార్మికులకు లాభాల బోనస్ చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. బుధవారం ఇల్లెందులోని సోలార్ ప్లాంట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేశారు. అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలని, టెక్నీషియన్‌లను రాత్రిపూట గస్తీ చేయించరాదని, హెల్పర్లను మొయిన్‌గేట్ వాచ్‌మెన్‌లుగా పని చేయించరాదని డిమాండ్ చేశారు. ఆగస్టు జీతం వెంటనే చెల్లించాలని కోరారు. కృష్ణ, ప్రేమ్‌సింగ్, శంకర్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీట్లు పెంచాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలో ఈ ఏడాది జరిగే ప్రవేశాలలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తున్నందున దీనికి అనుగుణంగా ఎంబీబీఎస్ సీట్లను కూడా పెంచాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

జిల్లా స్థాయి పోటీలకు బేతంపూడి విద్యార్థులు

టేకులపల్లి: మండల, జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన బేతంపూడి ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎన్నికయ్యారని హెచ్‌ఎం ధరావత్ తారాసింగ్, పీఈటీ నాగలక్ష్మి తెలిపారు. ఈమేరకు బుధవారం పాఠశాలలో వారు విద్యార్థులను అభినందించారు. కబడ్డీ, పరుగు పందెం, షాట్‌పుట్ పోటీల్లో ధరావత్ శ్రీజ, బోడ సాయికుమార్, మాలోత్ అక్షయ్, బానోత్ జ్యోతిక ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, సరోజ్‌కుమార్, సైదులు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కొత్తగూడెం ఎఫ్‌డీఓకు ఇల్లెందు అదనపు బాధ్యతలు

ఇల్లెందురూరల్: కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావుకు ఇల్లెందు ఎఫ్‌డీఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇల్లెందు ఎఫ్‌డీఓగా ఉన్న కర్నావత్ వెంకన్నను పలు ఆరోపణల మేరకు సర్వీసు నుంచి తొలగించారు. దీంతో పరిపాలన సౌలభ్యం కోసం కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

వాస్తవ లాభాల్లో 33శాతం ఇవ్వాలి

ఇల్లెందు: సింగరేణి కార్మికులకు వాస్తవ లాభాల్లో 33శాతం వాటా చెల్లించాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ జాఫర్ హుస్సేన్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.రంగనాథ్ కోరారు. బుధవారం ఇల్లెందులో ఏరియా జీఎం జాన్‌ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... లాభాల వాటా ప్రకటిస్తే కార్మికుల్లో హర్షం వ్యక్తం అయినప్పటికీ లాభాలు ఎక్కువ ఉన్నప్పటికీ పంపిణీ మాత్రం తక్కువ ఉందన్నారు.

విధుల్లో చేరిన ఎంఈఓలు

టేకులపల్లి: టేకులపల్లి మండల విద్యాశాఖాధికారి(ఎఫ్ఏసీ)గా అజ్మీర జగన్‌నాయక్ బుధవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈఓగా పని చేసిన ఠాకూర్ రాంసింగ్ ఖమ్మానికి బదిలీ అయ్యారు.

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఎంఈఓగా మండల నోడల్ అధికారి స్వామి నియమితులయ్యారు. ప్రస్తుతం మెయిన్‌రోడ్డు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పీహెచ్‌సీ సందర్శన

టేకులపల్లి: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోతు హరిప్రియ ఆదేశాల మేరకు బుధవారం బీఆర్‌ఎస్ టేకులపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్యులు, రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బొమ్మెర వరప్రసాద్, బోడ బాలునాయక్, కిషన్ నాయక్ పాల్గొన్నారు.

30న చలో హైదరాబాద్

ఇల్లెందురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాలలో బుధవారం ప్రచారం నిర్వహించారు. పలు గ్రామపంచాయతీ కార్యాలయాల ఎదుట ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ కార్మికుడు మృతి

సింగరేణి(కొత్తగూడెం): కమ్యూనిస్టు నాయకుడు, సింగరేణి మాజీ కార్మికుడు బేతి లక్ష్మీనారాయణ (70) బుధవారం మృతి చెందారు. సీపీఎం నాయకులు కాసాని ఐలయ్య, అన్నవరపు కనకయ్య, సత్యనారాయణ, వీరన్న, లిక్కి బాలరాజు, నాగశీతా రాములు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

డ్రగ్స్ నివారణకు సహకరించండి..

- విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు
- గంజాయి నిర్మూలనకు అందరూ కృషి చేయాలి
- పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన



జూలూరుపాడు: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు మంచి గోల్ ఎంచుకొని భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని, డ్రగ్స్‌కు బానిసలు కావద్దని టూ టౌన్ పోలీసులు అన్నారు. టూ టౌన్ సీఐ రమేష్ కుమార్, ఆదేశాల మేరకు సిబ్బంది బుధవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం హైస్కూల్, గరీబ్‌పేటలోని పాఠశాలలో సైబర్ నేరాల మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే 100కు ఫోన్ చేయాలని, అదేవిధంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఒక్కసారి వాటికి అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని, వీటికి దూరంగా మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభుదయాళ్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: డ్రగ్స్ నివారణకు ప్రతీఒక్కరు సహకరించాలని కొత్తగూడెం త్రీటౌన్ సీఐ శివప్రసాద్ అన్నారు. బుధవారం కొత్తగూడెం రైల్వేస్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. మత్తుకు బానిసలు కాకుండా, నమ్ముకున్న కుటుంబాలను రోడ్డున పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గంజాయికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రఘు, సిబ్బంది హీమాలాల్, వెంకట్, నాగరాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వన్‌టౌన్ ఆధ్వర్యంలో...
కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో వన్ టౌన్ సీఐ కరుణాకర్, ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఎస్సై విజయ, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని కృష్ణవేణి, నలంద వివేకవర్ధిని కాలేజీలలో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ రమణారెడ్డి మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నిషేధిత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. క్షణికావేశంలో జీవితాన్ని పాడుచేసుకోవద్దన్నారు. ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద ఆటోలు, బస్సులకు మాదకద్రవ్యాల నిర్మూలన స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భీమ, హెడ్‌కానిస్టేబుల్ రఘురాంరెడ్డి, రఘు తదితరులు ఉన్నారు.

జూలూరుపాడు: స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం జూలూరుపాడులో డ్రగ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని పాపకొల్లు క్రాస్ రోడ్, చంద్రుగొండ క్రాస్ రోడ్, బస్‌స్టాండ్ సెంటర్లలో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రజలను కోరారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ వెంకట్, సురేష్, కుటుంబరావు, పాల్గొన్నారు.

టేకులపల్లి: గంజాయి వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని, వాటికి దూరం ఉండటంతోనే యువతకు భవిష్యత్ ఉంటుందని టేకులపల్లి ఎస్ఐ పోగుల సురేష్, బోడు ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి, బోడులలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువతకు గంజాయిపై అవగాహన కల్పించారు.

గంజాయికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుగుతున్నా, ఎవరైనా గంజాయి వినియోగిస్తున్నా సమాచారం తెలిస్తే 100 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్



సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టూ టౌన్ సీఐ రమేష్‌కుమార్



టేకులపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న స్థానికులు

అంగన్‌వాడీల్లో సేవలు అభినందనీయం



పోషక పదార్థాల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తహసీల్దార్, ఎంపీడీఓ

టేకులపల్లి: అంగన్‌వాడీల్లో తల్లీబిడ్డలకు పోషకాహారం లభిస్తుందని, అంగ్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం బోడులోని రైతువేదికలో పోషణ్ అభియాన్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టేకులపల్లి మండలంలో తల్లీబిడ్డల సంరక్షణ, ఆరోగ్యం విషయంలో అంగన్‌వాడీల సేవలు బాగున్నాయన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి, పిల్లల ఎదుగుదలకు ఐసీడీఎస్, వైద్యశాఖలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే పిండివంటలు, ఆకుకూరలు, కూరకాయలతో ఏర్పాటు చేసిన స్టాల్‌ని ఎమ్మెల్యే పరిశీలించి మునగ చపాతీ, రాగి లడ్డూలను రుచి చూశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగభవానీ, ఎంపీడీఓ జి.రవీంద్రరావు, సీడీపీఓ కెఎం.తార, సీహెచ్ఓ పార్వతి, సూపర్‌వైజర్లు కె.అనురాధ, నిర్మల, యశోదమ్మ, లక్ష్మి, ఖలీదా, కార్యదర్శి లక్ష్మణ్, ఏఈఓ రమేష్, దేవా, పోరండ్ల, నాగుబండి, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశస్త్ యాప్‌పై టీచర్లకు శిక్షణ



పాల్వంచ: మాట్లాడుతున్న సైదులు

టేకులపల్లి: ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ విద్యార్థులను స్క్రీనింగ్ ద్వారా గుర్తించి వారికి అనుకూలమైన విద్యా బోధన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రశస్త్ యాప్ నిర్వహణపై ఈనెల 27 వరకు మూడు రోజులు ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమం బుధవారం సులానగర్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ అజ్మీరా జగన్ నాయక్ ప్రారంభించారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు మొత్తం 407 మంది ఉండగా వారిని మూడు రోజులకు విభజించారు. యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఎలా ఉపయోగించాలి, ప్రత్యేక అవసరాలున్న బాలబాలికలను ఎలా గుర్తించాలి, వారిని స్క్రీనింగ్ చేసే పద్ధతి తదితర అంశాలను ఐఈఆర్‌టీలు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దేవదాసు, ఐఈఆర్‌టీలు రవీందర్, నీరజాషారోన్, సారయ్య పాల్గొన్నారు.

పాల్వంచ: అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని విద్యాశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారి ఎస్‌కే సైదులు అన్నారు. బుధవారం పాల్వంచ బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ప్రశస్త యాప్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడారు. వైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తించి వారికి మరింత మెరుగైన విద్యను అందించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ బి.ప్రకాష్‌రావు, రిసోర్స్ పర్సన్ రామారావు, ఎఫ్ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్ నాయక్

టేకులపల్లి: అసంబద్ధమైన సర్దుబాటు ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని టీఎస్‌టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సులానగర్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ... సర్దుబాటు కోసం జారీచేసిన మార్గదర్శకాలు ప్రాథమిక పాఠశాలల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తెలుస్తోందన్నారు. కాలం చెల్లిన 2015 నాటి రేషనలైజేషన్ నిబంధనలను అమలు చేయాలని చూస్తున్నారని, 10 మంది విద్యార్థులకు 1 టీచర్, 60 మందికి ఇద్దరు టీచర్లు అనే నిబంధనతో ప్రాథమిక పాఠశాలలు ఎలా బలోపేతం చేయాలో అధికారులే చెప్పాలని పేర్కొన్నారు. బడుగు, బలహీనవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యకు దూరం చేసే కుట్రలో భాగంగానే ఈ ఉత్తర్వులు ఇచ్చినట్లుగా భావించాల్సి వస్తుందని తెలిపారు. పెండింగ్ డీఏ, పీఆర్‌సీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వి.హత్తీరామ్‌నాయక్, సమ్మయ్య, సారయ్య, బాదావత్ పూల్‌సింగ్, శరవన్, మంగీలాల్, వెంకట్రాం, కృష్ణకుమారి, సుశీల, శారద, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కట్టించే వరకు పోరాడుతాం..

పాల్వంచ: పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇచ్చే వరకు పోరాడుతామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ అన్నారు. బుధవారం స్థానిక నవభారత్ వద్ద సీపీఎం శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఒక్కరికి కూడా ఇంటి స్థలం, ఇళ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని తలదాచుకునే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. నిత్యావసరాల ధరలను తగ్గించాలని, మహిళలకు బస్సు ప్రయాణం ఉచితంగా ఇచ్చి మిగతా పథకాలను విస్మరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మచ్చ వెంకటేశ్వర్లు, దొడ్డా రవికుమార్, కె.సత్య, పి.తులసీరామ్, ఎస్‌కె.రహీం, కాంతి, వాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి



వినికిడి యంత్రాలను అందజేస్తున్న భానుమతి

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగులకు అంగవైకల్యం అడ్డుకాదని, ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే సాధించలేనిది ఏమీ లేదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. ప్రపంచ బధిరుల దినోత్సవం సందర్భంగా బుధవారం కొత్తగూడెం బాబుక్యాంప్‌లోని భవిత సెంటర్‌లో మూగ, చెవిటి పిల్లలకు మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగవైకల్యాన్ని జయించి చాలామంది దివ్యాంగులు అనేక రంగాలలో విజేతలుగా రాణించారని కొనియాడారు. అనంతరం కొత్తగూడెంలోని పన్నాలాల్ టెక్స్‌టైల్స్ అధినేత సరంజన్‌కుమార్ అగర్వాల్ బధిరులకు వినికిడి మిషన్లను న్యాయమూర్తి చేతుల మీదుగా అందించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తంరావు, ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ మాజీ ఎంపీటీసీ కొల్లు పద్మ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తూము చౌదరి, కోనేరు సత్యనారాయణ, తోట దేవీప్రసన్న, తాటి పద్మ తదితరులు ఉన్నారు.

బ్యాగ్‌లు వితరణ

టేకులపల్లి: కొప్పురాయిలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఎస్‌జీఓ సంస్థ సహకారంతో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు చొరవతో మండల విద్యాశాఖాధికారి అజ్మీర జగన్ నాయక్ చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్, గుగులోత్ మోతీలాల్, రమేష్ బాబు, పన్నాలాల్, సుబ్బారావు, హెచ్‌ఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిలో విద్యార్థులు..



అంగన్‌వాడీ పాఠశాల చుట్టూ చేరిన వరద

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో బుధవారం మధ్యాహ్నం భారీగా వర్షం కురిసింది. దీంతో తిలక్‌నగర్ గ్రామపంచాయతీ బొల్లినగర్‌లో అంగన్‌వాడీ పాఠశాలను వరద చుట్టుముట్టింది. సరిగ్గా పాఠశాల సమయం ముగిసే సమయంలో ఇది జరగడంతో.. చిన్నారులు పాఠశాల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. చాలాసేపు పాఠశాలలోనే వేచి ఉన్న చిన్నారులను తల్లిదండ్రులు వచ్చి ఇంటికి తీసుకెళ్లాల్సి వచ్చింది. అధికారులు స్పందించి వరదనీరు తరలిపోయే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దు..



సుజాతకు వినతిపత్రం అందిస్తున్న ఆర్యవైశ్యులు

పాల్వంచ: అమరజీవి ఆంధ్ర రాష్ట్ర అవతరణ మహనీయుడు పొట్టి శ్రీరాములు పేరుతో ఉన్న తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని సురవరం ప్రతాపరెడ్డి పేరుగా మారుస్తామనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పాల్వంచ ఆర్యవైశ్య మహాసభ కమిటీ నాయకులు కోరారు. బుధవారం రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత భద్రాచలం సీతారాముల స్వామి దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణంలో పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆమెకు వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల్లో గొప్ప వ్యక్తిగా ఖ్యాతిగాంచిన పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని, కొత్తగా నిర్మించే ప్రాజెక్ట్‌లకు ప్రతాపరెడ్డి పేరును పెట్టుకోవాలని సూచించారు. సుజాత మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు చలవాది ప్రకాష్, కొడుమూరి దయాకర్, నవీన్, సాయి, ఉప్పల వెంకటేశ్వర్లు, పెండ్యాల సతీష్, గూడెపు శ్రీనివాస్, బచ్చు శ్రీనివాస్, భాస్కర్, శివ పాల్గొన్నారు.

సంస్థ విస్తరణకు ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకం



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఏడాది సాధించిన లాభాల్లో 33శాతం కార్మికులకు ఇవ్వడం, 67శాతం నిధులతో కంపెనీ విస్తరణ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వ ప్రతినిధులు, సింగరేణి సీఎండీ నిర్ణయం చారిత్రాత్మకమైందని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్ అన్నారు. బుధవారం కొత్తగూడెం ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్‌లో గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం కనీసం కార్మిక సంఘాల నాయకులతో చర్చించకుండా, కనీసం వారిని పిలవకుండా, ఒంటెద్దు పోకడతో నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. 134 సంవత్సరాల చరిత్రలో ఎన్నడూలేని విధంగా అవుట్ సోర్సింగ్ కార్మికులు రూ. 5 వేలు లాభాల్లో వాటా ఇవ్వడం గొప్ప విషయమన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను గుర్తించిన ఐఎన్‌టీయూసీ నాయకులు మేనేమెంట్‌తో చర్చించి వారికి ఇప్పించారన్నారు. ఈ కార్యక్రమంలో బూటుక రాజేశ్వరరావు, జిదుల రాజేశ్వరరావు ఎస్కే గౌస్, నట్రాజ్, ఎం.అశోక్, ఏమస్స్, భిక్షపతి, తిరుపతి, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక విధానంతోనే ఆర్థిక ప్రగతి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పిచ్చయ్య

ఇల్లెందురూరల్: నూతన పారిశ్రామిక విధాన తీర్మానాల కారణంగా ప్రపంచంలో భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా రూపాంతరం చెందుతోందని ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల అర్థశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ పిచ్చయ్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన పారిశ్రామిక విధానంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన ప్రసంగిస్తూ.. 1991లో భారత ప్రభుత్వం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు నూతన పారిశ్రామిక విధానం ఉపయోగపడిందన్నారు. ఈ విధానం ప్రధానంగా లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ ఆధారంగా రూపొందించబడిందని చెప్పారు. ఫలితంగా నేడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం ఒక బలమైన ఆర్థికశక్తిగా నిలబడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్పయ్య, అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, ప్రభాకర్‌రావు, వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

27న విద్యార్థి మహాగర్జన



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం)/జూలూరుపాడు: ఈనెల 27న జరగనున్న విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, రెగ్యులర్ ఎంఈఓ, డీఈఓలను నియమించాలని, అన్ని జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్ర వీరభద్రం పేర్కొన్నారు. బుధవారం కొత్తగూడెం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాపిత విద్యార్థుల సమస్యల సాధన కోసం ఈనెల 27న హైదరాబాద్‌లో విద్యార్థి మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బయ్యా అభిమన్యు, మందా నాగకృష్ణ, రామ్ చరణ్, సాయి, పవన్, రాము, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జూలూరుపాడు హైస్కూల్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యుడు పి.పవన్ మాట్లాడగా.. అనిల్, శివమణి, అఖిల్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు వైద్యపరీక్షలు



ఇల్లెందు: వైద్యశిబిరానికి వచ్చిన కార్మికులు

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని మున్సిపల్, గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహించే మల్టీపర్పస్ వర్కర్లకు బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ డాక్టర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంఅర్బన్: పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది



చుంచుపల్లి: కార్మికులకు శానిటేషన్ కిట్లు అందజేస్తున్న డీపీఓ చంద్రమౌళి



పాల్వంచరూరల్: సఫాయిమిత్ర వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ



ఇల్లెందురూరల్: కార్మికులకు మందులు అందజేస్తున్న ఎంపీడీఓ ధన్‌సింగ్, డాక్టర్ కవిత